వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 44
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
అక్టోబర్ 30, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## బీసీలకు అన్యాయం చేస్తే యుద్ధమే



8లో..

- జీఓ 29 రద్దు చేయాలి
- ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్
- హనుమకొండలో నిరసన దీక్ష



8లో..

## బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ

కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన రాథోడ్ రమేష్



8లో..

## రైస్ మిల్లర్లు సహకరించాలి

- నిర్ణీత గడువులోగా ధాన్యం కొనుగోలు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

# కాలగర్భంలో కళాక్షేత్రం







వివరాలు2లో..

- డంపింగ్ యార్డ్ గా పోతన ఆడిటోరియం
- ఆయన స్మృతులను చెరిపేస్తున్న పాలకులు
- బల్దియాకు కూతవేటు దూరంలోనే బరితెగింపు
- పునర్నిర్మాణానికి రూ.245.35 లక్షల మంజూరు
- శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్న అధికారులు

పలికెడిది భాగవతమట.. పలికించెడివాడు రామభద్రుడంట అంటూ రాముడిని కీర్తించిన పోతనామాత్యుని భక్తిప్రపత్తుల గురించి ఎంత చెప్పినా తక్కువే. అంతటి మహనీయుడు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వాడు కావడం మనం చేసుకున్న పుణ్యంగా భావించేవారున్నారు. 15వ శతాబ్దంలో పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో జన్మించిన సహజ పండితుడు, మహాకవి బమ్మెర పోతన రచనలను నేటి తరానికి అందించాలన్న లక్ష్యంతో 1982లో ఓరుగల్లు గడ్డపై పోతన పంచ శత జయంతి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. అదే విధంగా ఇక్కడి కవులు, కళాకారులు, సంగీత ప్రేమికుల ఉపయోగార్థం బమ్మెర పోతన పేరుతో బహిరంగ రంగస్థలం (ఓపెన్ ఆడిటోరియం) నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వ సాంకేతిక మంత్రి టి.హయగ్రీవాచారి 12 మే 1982లో శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తి అయ్యాక ఇందులో సురభి నాటకాలతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత ఏమైందో ఏమో మహా కవిని మట్టిలో కలిపేందుకు కుట్ర పన్నారు. బహిరంగ రంగస్థలాన్ని డంపింగ్ యార్డుగా మార్చారు. ఇటీవలనే డంపింగ్ యార్డును పక్కనే ఉన్న మరో ప్రాంతానికి తరలించడంతో మహాకవి బమ్మెర పోతనామాత్యుని గుర్తుగా అధునాతన హంగులతో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలన్న డిమాండ్ తెరమీదికి వచ్చింది. అయితే పోతన గుర్తులను బల్దియా అధికారులు భావితరాలకు అందిస్తారా..లేక నామరూపాలు లేకుండా తుడిచేస్తారా వేచిచూడాల్సిందే..

- వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

## పకడ్బందీగా కుటుంబ సర్వే

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా | అధికారులకు అవగాహన కార్యక్రమం



2లో..



8లో..

## క్రియాశీల సభ్యత్వం ముమ్మరంగా చేయాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి
- భారీగా హాజరైన మద్దతుదారులు

# కాలగర్భంలో కళాక్షేత్రం



- డంపింగ్ యార్డ్ గా పోతన ఆడిటోరియం
- ఆయన స్మృతులను చెరిపేస్తున్న పాలకులు
- బల్దియాకు కూతవేటు దూరంలోనే బరితెగింపు
- పునర్నిర్మాణానికి 2021లో రూ.245.35 లక్షల మంజూరు
- శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్న అధికారులు

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** శ్రీమద్ భాగవతాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన మహాకవి బమ్మెర పోతన స్మారకార్థం నిర్మించిన పోతన విజ్ఞాన పీఠం కాలగర్భంలో కలిసిపోతోంది. కలలకు నెలవైన ఓరుగల్లులో 1982లో నిర్వహించిన పోతన పంచశత జయంతి ఉత్సవాల సందర్భంగా నగరంలోని 27వ డివిజన్ పోతన నగర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ రంగస్థలం (ఓపెన్ ఆడిటోరియం) నేడు పొడి చెత్త నిర్వహణ కేంద్రంగా దర్శనమిస్తోంది. వరంగల్ మహా నగర పాలక సంస్థ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్న పోతన ఆడిటోరియాన్ని భవిష్యత్ తరాలకు దిక్సూచిగా అభివృద్ధి చేయాల్సిన బల్దియా పాలకవర్గం, అధికారగణం దాన్ని డంపింగ్ యార్డుగా మార్చి కవులను, కళాకారులను అవమానించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆడిటోరియం నిర్మాణం పూర్తయిన తొలినాళ్లలో ఇందులో వారం రోజుల సురభి నాటకాలతో కొన్ని సంవత్సరాల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దీనిని కల్యాణ వేదికగా అభివృద్ధి చేసి నిరుపేదలకు, మధ్య తరగతి కుటుంబాలకు తక్కువ ఖర్చుతో అందించేందుకు కూడా ఏర్పాటు చేశారు.

### డంపింగ్ యార్డుగా.

నగర పాలక సంస్థ నిర్వహణలో ఉన్న పోతన ఆడిటోరియంపై పాలకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో కళాకారులకు వేదిక కావాల్సిన ఆడిటోరియం ఊరిలోని చెత్త, చెదారానికి వేదికగా మారింది. నిత్యం వందల కొద్ది ఆటోల్లో తీసుకొచ్చిన చెత్తను ఇక్కడే డంపింగ్ చేసేవారు. సెకండ్ ట్రాన్స్ మిషన్ కేంద్రంగా దీనిని మార్చి ఇక్కడికి భారీ మొత్తంలో వచ్చిన చెత్తను డంపర్ల ద్వారా మడికొండ డంపింగ్ యార్డుకు తరలించేవారు.

### పునర్నిర్మాణానికి రూ.245.35 లక్షలు..


మహా నగర పాలక సంస్థ జనరల్ ఫండ్ నుంచి రూ.245.35 లక్షలతో పోతన ఆడిటోరియం నిర్మాణానికి 7 ఫిబ్రవరి 2021లో అప్పటి మేయర్ గుండా ప్రకాశ్ రావు శంకుస్థాపన చేశారు. త్వరలోనే దీనిని ప్రజలకు ఉపయోగ పడేలా తీర్చి దిద్దుతానంటూ ప్రకటనలు చేశారు. అవన్నీ నీటి మూటలుగానే మిగిలాయి. అయితే ఇటీవలనే డంపింగ్ యార్డ్ ను పక్కనే ఉన్న మరో స్థలంలోకి మార్చడంతో పలువురికి ఉపయోగ పడేలా పోతన ఆడిటోరియం పనులను యుద్ధ ప్రాతిపధికన చేపట్టాలని కళాకారులు, కళా పోషకులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మహా కవి గుర్తుగా నిర్మించుకు బహిరంగ రంగస్థలం కాలగర్భంలో కలిసి పోవడం ఖాయం. ఇప్పటికే కళాక్షేత్రం కప్పు పూర్తిగా దెబ్బతిన్నది. రేకులు ఎగిరిపోయాయి. గోడలు పగుళ్లుబడ్డాయి. అక్కడక్కడ కూలిపోయిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. కళాక్షేత్రానికి వెనుక భాగంలో పిచ్చి చెట్లు మొలచి కళాహీనంగా దర్శనమిస్తున్నాయి.

### కళలను ప్రోత్సహించాలి..

కళలను, కళాకారులను ప్రోత్సహించాలన్న డిమాండ్ పెరుగుతోంది. బల్దియా సాధారణ నిధులనుంచి పెద్ద మొత్తంలో కేటాయించి కళాక్షేత్రానికి పట్టిన ఖంపును తొలగించాలంటున్నారు. దీనిని కల్యాణ మండపంగా తీర్చి దిద్దితే కళాకారులతో నిరుపేదలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందంటున్నారు. బల్దియా కార్యాలయానికి అతిసమీపంలో నగరం నడిబొడ్డున ఉన్నందున దీనిని ప్రజాధరణ ఎక్కువగానే ఉంటుందంటున్నారు. ఈ దిశగా బల్దియా అధికారులు దృష్టి సారించి మహా కవి బమ్మెర పోతనకు తగిన గుర్తింపు నివ్వాలని కోరుతున్నారు.







# పకడ్బందీగా కుటుంబ సర్వే

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా
- అధికారులకు అవగాహన కార్యక్రమం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నవంబర్ 6 నుంచి 18 వరకు నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, రాజకీయ,కుల సర్వే) పై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి కలెక్టర్ సామాజిక, ఆర్థిక, సర్వే మార్గదర్శకాలపై మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, సూపర్వైజర్లకు శిక్షణ నిర్వహించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. సర్వే పారదర్శకంగా ఉండాలని, విషయాలను గోప్యంగా ఉంచాలని, ఎలాంటి తప్పులు లేకుండా సర్వే పక్కగా చేయాలని, ఏ ఒక్క విషయం తప్పుపోకుండా అన్ని వివరాలు సేకరించాలని తెలిపారు. వివరాల సేకరణ అనంతరం డేటా ఎంట్రీ సైతం పక్కగా సంబంధిత గణకుడు నిర్వహించాలని చెప్పారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నవంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు గృహాల లిస్టింగ్ చేసుకొని నవంబర్ 6వ నుంచి సర్వే ప్రారంభించాలన్నారు. అనంతరం సర్వేకు సంబంధించిన ప్రశ్నలను కలెక్టర్ స్వయంగా శిక్షణ పొందిన అధికారులను అడిగి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, సీపీఓ గోవిందరాజులు, డీఆర్డీఓ కౌసల్యాదేవి, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి జిల్లా, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### వేగవంతంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఏర్పాటు చేసిన అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ఆ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియ పురోగతి, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 31,800 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా, అందులో 1,957 దరఖాస్తులు మాత్రమే పరిశీలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అలసత్వాన్ని వీడి అంకితభావంతో దరఖాస్తుల పరిశీలన వేగిరం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ పరిశీలన కోసం ఏర్పాటు చేసిన ప్రతి బృందం ప్రతిరోజు ఖచ్చితంగా ఇరవై దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను అదే రోజు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి రత్నకుమారి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ సిటీ ప్లానర్ రవీంద్ర రడెకర్ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలకు దారేది..?

- వెంచర్ యాజమానికి నిబంధనలు వర్తించవా
- ప్రాచీన కట్టడం ఆనవాళ్లు మాయం



**వరంగల్ వాయిస్, గణపురం :** అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో వెంచర్లు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమ వెంచరు కోసం నిబంధనలను సైతం బేఖాతరు చేస్తున్నారు. ఏకంగా పంట పొలాలకు వెళ్లే దారిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు మూసేసి తమ వెంచర్ చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు పెట్టుకోవడంపై రైతులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ నిర్మాణంతో పంట పొలాలకు వెళ్లే వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, ఆ స్థలంలో ఉన్న తాటి, ఈత చెట్లు నరికివేయడంతో కల్లు గీత కార్మికులు తమ జీవనాధారం కొల్పోయి రోడ్డున పడ్డారు. దీనికి తోడు ఆ వెంచర్ స్థలంలో ఉన్న కాకతీయుల కాలం నాటి దేవతల బావిని పూడ్చివేసి ఆధారాలు లేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రాచీన ఆనవాళ్లను పరిరక్షించాల్న నిబంధనలు ఉన్నప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా సదరు రియల్ వ్యాపారులు ఇష్టారాజ్యం వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇవన్ని జరుగుతున్నా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంలో అంతర్యమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మాముళ్ల మత్తులో అధికారులు మునిగిపోయి సదరు రియల్ వ్యాపారులకే అండగా నిలుస్తారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వెంచర్ యజమాని కోసం ఎంతోమంది మధ్య తరగతి కుటుంబాలు జీవనోపాధిని దూరం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు కూలీలకు ఆ భూమి గుండా స్వేచ్ఛగా పొలాలకు వెళ్లేలా పక్కా రోడ్డు నిర్మించాలని, తాటి, ఈత చెట్లను నరికినందుకు గౌడ సంఘానికి పరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## కేయూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా నాగరాజు



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల విభాగానికి నూతన అదనపు పరీక్షల నియంత్రణ అధికారులకు నియామక పత్రాలను వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అందజేశారు. ఆచార్య ముస్తఫా ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఆయన స్థానంలో ప్రస్తుతం పీజీ సెక్షన్ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా ఉన్న డాక్టర్ బి.నాగరాజును నియమించారు. అదే విధంగా డాక్టర్ తిరుమల దేవి పదవీ కాలాన్ని మరోక సమవత్సరం పొడిగిస్తూ ఉత్తర్వులు అందజేశారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు వీరిని అభినందించారు.

## అసిం ఇక్బాల్‌కు అభినందనల వెల్లువ



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల విభాగ నూతన అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగ సహాయ ఆచార్యులు అసీం ఇక్బాల్ ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అసిం ఇక్బాల్ విశ్వవిద్యాలయంలో 2013వ సంవత్సరంలో సహాయ ఆచార్యులుగా ప్రవేశించారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్‌గా, ఇంజినీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్) వైస్ ప్రిన్సిపాల్‌గా, పరీక్షల విభాగ క్యాంపు ఆఫీసర్‌గా పని చేశారు. 40కి పైగా పత్రాలను వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో ప్రదానం చేశారు. బెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా, భారత్ వికాస్ సంస్థ వారి యంగ్ సైంటిస్ట్ అవార్డును కూడా పొందారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అసిం ఇక్బాల్‌ను అభినందించారు.

## మెడికల్ కాలేజీకి పార్థీవ దేహం అప్పగింత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు శారాజిపేటకు చెందిన మంత్రి లక్ష్మి పార్థీవ దేహాన్ని తెలంగాణ నేత్ర, అవయవదాతల అసోషియేషన్ ఉమ్మడి వరంగల్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొంరెడ్డి మల్లారెడ్డి, కార్యవర్గసభ్యులు టి. జనార్దన్ రెడ్డి, చల్లా దశపతి, ఏ.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మి కుమారుడు మంత్రి దేవేందర్ ను, వారి కుటుంబ సభ్యులను అభినందించారు.

## బాస్కెట్ బాల్ పోటీలకు ప్రవీణ్, సాయి వర్ధన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బెంగళూరులోని క్రిస్ట్ యూనివర్సిటీలో నవంబర్ 1 నుంచి జరిగే సౌత్ జోన్ యూనివర్సిటీ బాస్కెట్ బాల్ పోటీలకు ఎం.ప్రవీణ్, సురాసి సాయి వర్ధన్ ఎంపికయ్యారు. వీరిద్దరూ హనుమకొండ జేఎన్ఎస్ సాట్ కోచ్ కొత్త ప్రశాంత్ దగ్గర కోచింగ్ తీసుకుంటున్నారు. ప్రవీణ్ ఎల్ బీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్, సాయి వర్ధన్ ఎస్ఆర్ యూనివర్సిటీ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన ప్రవీణ్, సాయి వర్ధన్ ను బుధవారం హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్ కుమార్, కోచ్ కొత్త ప్రశాంత్, కోచ్ లు, తోటి క్రీడాకారులు ఘనంగా అభినందించారు.

# జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయండి

### ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఐక్య)-(ఎంసీపీఐయూ), రివల్యూషనరి మార్క్సిస్టు పార్టీ ఆఫ్ ఇండియా-(ఆర్ఎంపీఐ)ల ఆధ్వర్యంలో ఏర్పడ్డ కమ్యూనిస్టు కో-ఆర్డినేషన్ కమిటీ(సీసీసీ) సమావేశాలు నవంబర్ 5, 6, 7 తేదీలలో హైదరాబాద్ బాగ్ లింగం పల్లి ఓంకార్ భవన్ లో జరుగుతుంది. ఈ సందర్భంగా అక్టోబర్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా నవంబర్ 7న సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాదులో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు-మతోన్మాద కార్పోరేట్ శక్తుల ప్రమాదం-వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం అనే అంశంపై జాతీయ సెమినార్ ను జయప్రదం చేయాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపు నిచ్చారు. నేడు బాగ్ లింగం పల్లి ఓంకార్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ సెమినార్ గోడ పత్రిక(పోస్టర్) ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమం లో యంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, వనం సుధాకర్, కుంభం సుకన్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు తాండ్ర కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా లేక పోవటం వలన దేశ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్ర అణిచివేతకు గురై పేదరికం, నిరుద్యోగం, అసమానతలు తీవ్రంగా పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. వీటికి మరింత ఆజ్యం పోసినట్టుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మైనారిటీ బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలపై యుద్ధం చేస్తున్నదన్నారు. దేశంలో 80 శాతం ఉన్న హిందూ ప్రజలపై జీఎస్టీ పేరుతో, రైల్వే రంగం ప్రైవేటీకరణ పేరుతో, ఎల్ఐసీ, రక్షణ రంగం, విమాన యానం, ఓడ రేవులు, చివరికి యుద్ధ రంగంలో వాడుతున్న పరికారాలను కూడా కార్పొరేట్ సంపన్న వర్గాలకు ఆదాని, అంబానీలకు అప్పచెప్పి, 78 సంవత్సరాల కాలం నుంచి ఉన్న విదేశాంగ విధానాన్ని కూడా దెబ్బ కొట్టేందుకు కూడా వెనుకాడడం లేదని మండిపడ్డారు. అందులో భాగంగానే ఆదాని ఏరో అండ్ డిఫెన్స్ కంపెనీ హెర్మస్ 900 అనే డ్రోన్లను ఇజ్రాయెల్ కు సరఫరా చేస్తూ ఈ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రభుత్వంగా మారుతుంది. ఈ కార్పొరేట్ వర్గాల దోపిడీ యధేచ్ఛగా సాగేందుకు ఫాసిస్టు విధానాలను అనుసరించి ప్రజా పోరాటాలను, ఉద్యమాలను అణిచి వేస్తున్నదని, దీనికి ప్రజా పక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీలు తగిన ఐక్య కార్యాచరణతో ముందుకు వెళ్లేందుకు ఎంసీపీఐ(యూ)-ఆర్ ఎంపీఐల ఆధ్వర్యంలో కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ జాతీయ సెమినార్ అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ స్ఫూర్తితో నవంబర్ 7న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10-30 నిమిషాలకు ప్రారంభం అయి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. దీనికి వామపక్ష మేధావులు, విద్యావంతులు, ప్రజాతంత్ర వాదులు, యువత, విద్యార్థి, కార్మిక, సకల వర్గాలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఝాన్సీ రెడ్డిని పరామర్శించిన రాయపర్తి కాంగ్రెస్ పార్టీ నేతలు



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** ఇటీవల తొర్రూరులో ఓ షాపింగ్ మాల్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజక వర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డిని రాయపర్తి మండలం సన్నూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. హైదారాబాద్ లో విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను నాయకులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పార్టీ గ్రామ అధ్యక్షుడు తాండాల యాకయ్య, ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కుందూరు రమేష్ రెడ్డి, చిన్నపాక రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిన్నపాక చరేశ్, మాజీ వార్డ్ సభ్యులు చిన్నపాక సోమయ్య, నర్సయ్య, యూత్ అధ్యక్షుడు జి.శ్రీకాంత్, డీలర్ యాకయ్య, నాయకులు యాకయ్య, రాందాస్, యూత్ సభ్యులు మేడి రవీందర్, రవి, ఈరెల్లి హరీష్, శ్రీకాంత్, చేరిపెల్లి మధు పాల్గొన్నారు.

## సంఘం పేరుతో బడికి.. ఎగనామం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మహబూబాద్ జిల్లాలో ఓ ఉపాధ్యాయ సంఘం చేస్తున్న కార్యకలాపాలు విమర్శలకు తావిస్తోంది. పూర్తి వివరాల్లోకి వెళితే ఈ మధ్యకాలంలో మండలంలో ఉపాధ్యాయ సంఘం పేరా వారు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను చేర్పించే క్రమంలో కొన్ని మండలాల్లో చేరికలు పదుల సంఖ్యలో ఉంటే ఓ సంఘం సంబంధించిన వ్యక్తులే 20 నుంచి 30 మంది ఉపాధ్యాయులు ఎలాంటి సెలవులు పెట్టకుండా ఎంఈఓ కార్యాలయం దగ్గర తిష్ట వేసి ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. అయినా స్థానిక ఎంఈఓ పట్టించుకున్న దాఖలాలు ఎక్కడ కన బడలేదు. ఓ సంఘం రాష్ట్ర స్థాయి నాయకులమంటూ ఒకరు, జిల్లా స్థాయి అంటు ఒకరు, మండల స్థాయి అంటూ మరోకరు ఆయా కాంప్లెక్స్ లలో బదులకు ఎగనామం పెట్టి ఐడీ కార్డుల పేరా కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు సర్వీస్ చేస్తున్నట్లు హంగామా ఆర్భాటం చేస్తూ బదులకు వెళ్లకుండా ఎంఈఓ మావోడే కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మావోడే ఏదైనా మేమే చేస్తామంటూ కొత్తవారిని సైతం పక్కదారి పట్టిస్తున్నారు. కొందరు కొన్ని మండలాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. డీఈఓలు, సీఆర్పీలు చేయవలసిన పనులు కూడా వీరే చేస్తున్నారు. బదులకు ఎగనామం పెట్టి ప్రతిరోజు తిరుగుతున్నారనే ప్రచారం కొనసాగుతుంది. గతంలో పనిచేసిన ఎంఈఓ పూల్ చంద్ అవినీతి అక్రమాలపై పూర్తి విచారణ చేపట్టాలని మరిపెడ మండల టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గతంలో సమాచార హక్కు చట్ట ప్రకారం వివరాలు కోరిన సమాచారం ఇవ్వలేదన్నారు. అదే విధంగా ఎన్నో ఏళ్లుగా విద్యావనరుల కేంద్రంలో బిల్లుల పేరా బడికి ఎగనామం పెడుతున్నవారిని చర్యలు తీసుకుని వెంటనే బడికి పంపించాలని ఆయన కోరారు.

# హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై దళితులు, మహిళల రక్షణ కోసం ఏర్పడిన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం కమలాపూర్ మండలంలోని నేరెళ్ల గ్రామంలో తహసీల్దార్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాదాసి సురేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ, దళితుల రక్షణ కోసం అనేక చట్టాలు రూపొందించినప్పటికీ నేటికీ కూడా అనేక చోట్ల దళితుల మీద దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు, వివక్షత కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కొంతమంది పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, స్టేషన్ బెయిలు ఇస్తూ, నిందితులకు సహకరిస్తూ నీరుగారుస్తున్నారని స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా బాధితులకు సత్వర న్యాయాన్ని అందించి, పరిహారాన్ని సకాలంలో అందజేయాలని కోరారు. తహసీల్దార్ సురేష్ కుమార్ మాట్లాడుతూ దళితులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ నరసయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఆకుల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గోల్కొండ సదానందం, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి మోరే ఐలయ్య, మాజీ ఉప సర్పంచ్ ముప్పు నరసయ్య, నాయకులు కోడెపాక రాజయ్య, చెలుపాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జాజులతో కలిసి నడుస్తా : తీగల ప్రదీప్ గౌడ్




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సామాజిక ఉద్యమ నాయకుడు, మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తీగల ప్రదీప్ గౌడ్ బుధవారం హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘంలో చేరారు. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆయనకు కండువా కప్పి సంఘంలోనికి ఆహ్వానించడంతో పాటు సంఘం జాతీయ అధికార ప్రతినిధిగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో బీసీల సమస్యలను పట్టించుకునే నాయకత్వం కరువై పదవుల కోసం ఉద్యమాలను తాకట్టుపెట్టిన చరిత్రలు చూస్తున్న సందర్భంలో జాజుల నాయకత్వంలో చిత్తశుద్ధిగా ఉద్యమం నడుస్తుందన్నారు. ఇలాంటి సందర్భంలో ఆయనకు అండగా నడవడం అవసరంగా భావించి ఆయనతో కలిసి పనిచేసేయడానికి సిద్దమైనట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ముందుకు తీసుకుపోతామన్నారు. బీసీ రిజర్వేషన్లను సాధించడంతో పాటు బహుజనుల రాజ్యాధికారం దాకా మా ప్రయాణం కొనసాగుతుందని తెలిపారు. బీసీల పేరు చెప్పుకొని రాజకీయ పార్టీలకు కొమ్ముకాసే నాయకులను, పదవుల కోసం బీసీల పేరు చెప్పుకొనే నాయకులతో బీసీ సమాజం అప్రమత్తంగా ఉండాలన్నారు. బీసీ సమస్యలపైన ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు.

### పోరాటాన్ని ఉధృతం చేస్తాం..

**జాజుల శ్రీనివాస్ గౌడ్**

గత 15 సంవత్సరాలుగా సామాజిక ఉద్యమాల్లో కొనసాగుతూ బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమాల్లో ఉన్న నాయకుడు బీసీ సంక్షేమ సంఘం లో చేరడం ఆనందంగా ఉందని ఆ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కులగణన ద్వారా పాక్షిక విజయం సాధించామని అదేవిధంగా బీసీ రిజర్వేషన్ లు సాధిస్తామన్నారు. ప్రదీప్ గౌడ్ రాకతో జాతీయ స్థాయిలో ఉద్యమ బలోపేతం అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నవంబర్ 3 నుంచి పోరాటాలను వినూత్నంగా కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్, దాడి మల్లయ్య, తాళ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సామర్థ్యాల పెంపు ఉత్తమ టీచర్‌తోనే సాధ్యం



**వరంగల్ వాయిస్, కేయూ :** విద్యార్థి సామర్థ్యాల పెంపు కేవలం ఉత్తమ టీచర్, పరిశోధకుడి ద్వారా మాత్రమే సాధ్యమని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ కమిటీ హాల్ లో నిర్వహించిన విభాగాధిపతులు, ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన భౌతిక శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య బి.వెంకట్రామరెడ్డిని శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. నిరంతర పరిశోధన, మంచి బోధనా, విద్యార్థి అభిమానం తద్వారా ఉత్తమ అధ్యాపకులుగా గుర్తింపు పొందగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డీన్ ఆచార్య జి. హనుమంత్, భౌతిక శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ జి.మంజులతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొని ఆచార్య వెంకట్రామరెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య బి.వెంకట్రామరెడ్డి తన కృతజ్ఞతను తెలియజేశారు.

# బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ ఎన్నిక

## అధ్యక్షుడిగా వెంకట్రాములు

## ప్రధాన కార్యదర్శిగా ధనంజయ నాయుడు




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి ఎన్.బాల మల్లేష్, రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ తదితర ప్రముఖులు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా తాటిపాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శిగా ధూళిపాల ధనంజయ నాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తాటి వెంకటేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శిగా నేదునూరి రాజమౌళి, ఉపాధ్యక్షులుగా రొయ్యల కృష్ణమూర్తి , పల్నాటి యాదయ్య, కళ్లెం కృష్ణ, బాలయ్య యాదవ్, సీహెచ్.దశరథ్, బుచ్చన్న యాదవ్, సహాయ కార్యదర్శులుగా ఎల్ శ్రవణ్ కుమార్, పెరుగు కుమార్, ఏశాల అశోక్, బొడ్డుపల్లి కృష్ణ, కే.ప్రమీల, విజయుడు కోశాధికారిగా వనం సత్యనారాయణ మరో 55 మందితో రాష్ట్ర కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెంకట్రాములు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన జరపాలని, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలని ,కేంద్ర మంత్రివర్గంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు జరపాలని, ఎన్నికల సందర్భంగా బీసీలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు పరచాలని సదస్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించిందన్నారు. డిమాండ్ల సాధనకై బీసీలంతా చైతన్యంతో సంఘటితమై సమైక్య పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చినట్లు వెంకట్రాములు తెలిపారు.

# కాంగ్రెస్ అంటేనే పేద ప్రజల పార్టీ

## దీపావళి కానుక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు



**వరంగల్ వాయిస్, ములుగు :** కాంగ్రెస్ అంటేనే పేద ప్రజల పార్టీ అని, దీపావళి కానుక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి సీతక్క ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గనపాక సుధాకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పథకాలలో భాగంగా దీపావళి పండుగకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వనున్నారు. కుల, మత పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 3500 గృహాల నిర్మాణానికి గ్రామ సభలు నిర్వహించి పేదలను గుర్తించి పారదర్శకంగా ఎంపిక చేస్తామని తెలిపారు. సీతక్క పోరాట ఫలితంగానే ములుగు జిల్లాకు గిరిజన యూనివర్సిటీ మంజూరైందని అన్నారు. గత ప్రభుత్వంలో గిరిజన యూనివర్సిటీకి భూమిని కేటాయించలేక పోయారని, కేవలం సీతక్క పది నెలల్లోనే చేయించారని గుర్తు చేశారు. సీతక్క కృషితోనే ఏటూరు నాగారం రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయడం జరిగిందని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గనపాక సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోనగాని సారయ్య, గౌడ్, సీనియర్ నాయకులు చుక్క కొమురయ్య, యూత్ నాయకులు గజ్జెల రాకేష్ పాల్గొన్నారు.

# ఘనంగా బొమ్మతి విక్రమ్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా ఓబీసీ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తాజ్, కల్లూరి పవన్, సెంసాని వంశీ బొకే అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే సన్నధాన్యానికి బోనస్

## ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజి రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని వెంకటేశ్వర్లపల్లె గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్ కమలపూర్) ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లపల్లె గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటను ప్రభుత్వం కేటాయించిన సెంటర్లలో మాత్రమే విక్రయించాలని, అలాంటప్పుడే ప్రభుత్వం ఇచ్చే సన్నరకాలకు రూ.500 బోనస్ వర్తిస్తుందని తెలిపారు. దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ దాసరి భిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్ బద్దిపడకు శ్రీలత–తిరుపతి రెడ్డి, ఏఈఓ రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యార రఘు, సమన్వయ కమిటీ సభ్యులు పెద్దబోయిన రవీందర్, సీనియర్ నాయకులు ఎరుకల అంజిరెడ్డి, పెంద్యాల విక్రం రెడ్డి, చెరుకుపల్లి రామచంద్రారెడ్డి, చెరుకుపల్లి సమ్మిరెడ్డి, చెరుకుపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, పాక పోచయ్య, ఆకుల రాజు, ఎరుకల అనంతరెడ్డి, గునిగంటి సదానందం, కారోబార్ వంగ రవీందర్, గ్రామ రైతులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, చెరుకుపల్లి రామిరెడ్డి, చిప్ప రాజేందర్, పెగడ సమ్మయ్య, సెంటర్ ఇంచార్జీలు పెంద్యాల మహేందర్ రెడ్డి, పెగడ ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన సమాచార శాఖ కమిషనర్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ఎస్.హరీష్ బుధవారం మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డిని బీఆర్కే భవన్ లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త కమిషనర్ కు చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ చర్యలపై వారు చర్చించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఇమ్మానియేల్ రాజ్



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** మండల కేంద్రానికి చెందిన సింగపురం విజయ్ కుమారుడి రిసెప్షన్ వేడుకల్లో స్టేషన్ ఘనపూర్ ఇంచార్జి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరా కుమారుడు యువ నాయకులు ఇమ్మానియేల్ రాజు పాల్గొన్నారు. స్టేషన్ ఘనపూర్ లోని ఐ కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన వివాహ రిసెప్షన్ లో వరుడు నిరీక్షణ్ రాజ్, వధువు ఉమాదేవీలను ఆశీర్వదించారు. ఆయన వెంట మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సింగపురం దయాకర్, నాగయ్య, బాలరాజు, చేవూరి రాజశేఖర్, మణి, గణేష్, ప్రతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ సమైక్యత ర్యాలీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక లాల్ బహదూర్ కళాశాలలో ఎన్సీసీ పదవ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్ జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టిన దినోత్సవం అక్టోబర్ 31ని పురస్కరించుకొని ఎన్సీసీ కాడేట్స్ కవాతు నిర్వహించి జాతి సమైక్యతకు బ్రిటిష్ వారు వివాదాలలో 554 రాష్ట్రాలను ముక్కలు చేసిన సుశీల భారతదేశాన్ని ఏకతాటి మీద తెచ్చి రాజ్య సమైక్యతకు పునాదులు వేసిన గొప్ప రాజనీతి వేత్త మొదటి హెూం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు నేటి యువత దేశ ప్రజలు తెలుసుకోవాలని ఉద్దేశంతో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సమైక్యత భావాన్ని ప్రజలకు తెలియజేయడానికి ములుగు రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఉక్కు మనిషిగా దృఢ సంకల్పంతో భారతదేశ సుశాల రాజ్య నిర్మాణంలో అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకొని హెూంశాఖ మంత్రిగా సమర్థవంతమైన సేవలందించిన గొప్ప మహానుభావుడని ఇతని సేవలు భావితరాలు ముందుకు తీసుకుపోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి, ఎన్సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ సదానందం, సీనియర్ అండర్ ఆఫీసర్ రాము, సృజన, సంతోషి, సీనియర్ అండ్ ఆఫీసర్ వర్షం జూనియర్ అండ్ ఆఫీసర్ కళ్యాణి, జూనియర్ అండ్ ఆఫీసర్ భాగ్య, శివాని, సాయి, గణేష్, రక్షిత, శృతి, అడ్మినిస్ట్రేటివ్ భవనం ముందు మానవహారం నిర్వహించి సమైక్య స్ఫూర్తిని నింపే ప్రతిజ్ఞ చేశారు.

## బిట్స్ అస్మాకలో దీపావళి సంబరాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ బిట్స్ అస్మాక ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తుగా దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ హాజరై దీపావళి ప్రతి సంవత్సరం ఆశ్వయుజ బహుళ అమావాస్య జరుపుకుంటామని, దీపావళి అంటే దీపాల వరుస అని, చెడుపై మంచి విజయం సాధించినందుకు గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి అని లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారని దీపావళి పండుగ విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అందంగా ముస్తాబై బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఉమ్మడి రేగొండ మండల బీఆర్ఎస్ నారాయపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు గణపాక కుమారస్వామి తల్లి సూరమ్మ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు బలే రావ్ మనోహర్ రావు బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భలే రావు శ్రీనివాసరావు, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## రేగొండ ఎస్ఐ సందీప్ కుమార్ ఉదారత



**వరంగల్ వాయిస్, రేగొండ :** నిరుపేద కుటుంబాలకు చేయూతనందించి రేగొండ ఎస్సై సందీప్ కుమార్ తన ఉదారతను చాటుకున్నారు. ఉమ్మడి రేగొండ మండలం, పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా చెంచుపల్లె గ్రామంలో నిరుపేదలకు ఒక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సందీప్ కుమార్ మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవడం మానవ ధర్మం అని, యువత కూడా వృథా ఖర్చులు పక్కన బెట్టి ఇలాంటి సేవ కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని పిలుపు ఇచ్చారు. చెంచు ప్రజలు మాట్లాడుతూ ఎస్ఐ కుటుంబం ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో చల్లగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

## ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మున్సిపాలిటీ పరిధిలో నెహ్రూ సెంటర్ నుంచి పత్తిపాక వరకు టీఎఫ్ఐడీసీ నిధులు ఐదు కోట్ల నిర్మాణ వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పరిశీలించారు. ఆ రోడ్డులో నివాసం ఉంటున్న ప్రజలు ఈ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని, పనులు అసంపూర్తిగా నిర్వహించడం వలన వాహనదారులు, ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని విన్నవించారు. దీంతో వారి అభ్యర్థన మేరకు ఎమ్మెల్సీ తక్షణం స్పందించి జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్స్, మున్సిపాలిటీ కమిషనర్ డీఈ మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా విస్తరణ పనులను అడ్డుకొంటూ కోర్టుకు వెళ్లిన వారిని ప్రజల అభ్యర్థన మేరకు పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తక్షణం బేషరతుగా కేసులను విరమించుకోవాలని కోరారు. కాంట్రాక్టర్ తో చరవాణిలో మాట్లాడి తక్షణం పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులలో ఎటువంటి ఆటంకాలు వచ్చిన నేను స్వయంగా పరిష్కరిస్తానని ప్రజలకు, అధికారులకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మారినేని వెంకన్న, మున్సిపాలిటీ అధికారులు, కమిషనర్ నోముల రవీందర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రవీణ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చిప్ప ఉపేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో అధ్యక్షతన 24-25, సంవత్సరం వానాకాలం సీజన్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అందుకు సంబంధించి ఐకేపీ (64), సహకార శాఖ (153), గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ (11), ఇతరులు 6, మొత్తం (234) ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపామని, సన్న రకాలు, దొడ్డు రకాలు, కేంద్రాలను వేరువేరుగా ఏర్పాటు చేయనున్నట్లు, ప్రభుత్వ సూచనల మేరకు మాయిశ్చర్ వచ్చేంత వరకు చూసి కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలన్నారు. టార్పాలిన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని, కొనుగోలు చేసే ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని, జియో ట్యాగింగ్ ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. ధాన్యం తీసుకువచ్చే రైతుకు వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి అవగాహనను కల్పించాలన్నారు. తద్వారా వెంట వెంటనే వారి అకౌంట్ లో డబ్బులు జమవుతాయని తెలిపారు. సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్, ట్రాన్స్ పోర్టేషన్, రెవెన్యూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, డీహెచ్ఓ మరియన్న, వ్యవసాయ శాఖ ఏడీ మురళి, లీగల్ మెట్రోలజీ విజయ్ కుమార్, ఆర్టీవో సాయి చరణ్, మెప్మా పీడీ విజయ, డీఎం మార్కెటింగ్, తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్‌మెంట్ జీవితంపై ముందస్తు ప్రణాళిక ఉండాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రిటైర్ మెంట్ తర్వాత జీవితం గురించి ముందస్తు ప్రణాళిక తయారు చేసుకోవాలి ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తు పదవీ విరమణ పొందుతున్న ఏ.నరహరిని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పదవీ విరమణ వీడ్కోలు సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ముందుగా పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ తరువాత ఏమి చేయాలనే దానిపై ముందస్తుగా అందరు ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. ముందస్తు ప్రణాళిక లేకుంటే మానసికంగా ఏన్నో సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. మనం ప్రతి రోజు ఏదో ఒక పని చేయటం వలన ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. రిటైర్‌మెంట్ అనంతరం పోలీసు శాఖ నుంచి రావలసిన అన్నిరకాల బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని తెలిపారు. రిటైర్‌మెంట్ అనంతరం ఆ భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం మీ కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నానని అన్నారు. మీరు పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివని, ఇక ముందు మీకు ఎలాంటి సమస్య వచ్చినా మాతో సంప్రదించండని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ ప్రతాప్, ఆర్ఐలు అనిల్, నాగేశ్వర్రావు, ఆర్ఎస్ఐలు పుల్లారావు, శేఖర్, సునంద, మౌనిక సిబ్బంది, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో టీచర్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా జీటీఏ (గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్) బలపరిచిన అభ్యర్థి డాక్టర్ దుర్గం రవి పక్షాన బుధవారం ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులతో సమావేశమై, ఓటరు నమోదుపై అవగహన కల్పించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డా.రవి మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్యం అవశ్యకతను తెలిపి టీచర్లు, అధ్యాపకులు వారి పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఇందులో జీటీఏ వరంగల్ జిల్లా అధ్యక్షులు తాళ్లపెల్లి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పబ్బోజు వీరచారి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గుజ్జ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి అనిశెట్టి పరమేశ్వర్ లు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ డాక్టర్. దుర్గం రవికి తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం, వరంగల్, హనుమకొండ జిల్లాల గోపా కమిటీలు, తెలంగాణ గ్రాడ్యుయేట్ ఫోరం, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాలు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు.

# ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు పోరాటాలు ఆగవు

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి సమావేశం బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ గౌడ్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందంగా తయారయ్యిందన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థ భ్రష్టుపట్టించింది. విద్యార్థుల సమస్యల పరిష్కారం చేయడంలో వైఫల్యం చెందిన విషయాలను కాంగ్రెస్ పార్టీ ఆసరాగా తీసుకొని ఎన్నికల సమయంలో, వివిధ సందర్భాల్లో మేము అధికారంలోకి వస్తే సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం జరిగింది. విద్యార్థి, యువత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్రమైన కృషి చేశారు. ఎట్టకేలకు కాంగ్రెస్ అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతున్నారు. విద్యాశాఖ కూడా ముఖ్యమంత్రి దగ్గరే పెట్టుకున్నాడు. కానీ అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తవుతున్న కూడా విద్యారంగంలో ఉన్న సమస్యలపై ఇంతవరకు ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించని పరిస్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గు చేటన్నారు. సాక్ష్యాత్తు విద్యాశాఖ రేవంత్ రెడ్డి వద్ద ఉండటం వలన రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని అందరూ భావించారు. కానీ, నేడు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మొదలుకొని విశ్వవిద్యాలయాల వరకు అనేక సమస్యలతో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. గురుకులాల్లో ఉన్న విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు రూ.7,800 కోట్లు బకాయిలు మూడు సంవత్సరాలుగా విడుదల చేయకపోవడంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. రేవంత్ రెడ్డి తక్షణమే విద్యారంగంపై సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కారం చేయాలని తెలియజేశారు. లేని పక్షంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా పోరాటాలు కొనసాగిస్తామని ప్రభుత్వాన్నిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జక్కుల భానుప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి కసర బోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు కుంటి పవన్, శ్రీపతి వినయ్, మాలోతు రాజ్ కుమార్, మాలోతు శ్రీనివాస్, పాలక్ లవన్ కుమార్ పాల్గొన్నారు.

# మిఠాయి పొట్లం స్వీట్ షాపులో తనిఖీలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని మిఠాయి పొట్లం స్వీట్ షాపు పై ఫుడ్ ఇన్ స్పెక్టర్ అధికారులు దాడులు చేయడంతో రూ.5వేల విలువచేసే కాలం చెల్లిన పలు జ్యూస్, తిని పదార్థాలు బయట పడ్డాయి. నిన్న సందీప్ అనే ఉద్యోగి పిల్లల కోసం జ్యూస్ కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లిన తర్వాత పిల్లల.. తన భార్య తాగడంతో అందరూ అస్వస్థతకు గురి కావటంతో వాంతులు, విరోచనాలకు గురి కావడంతో వరంగల్ హస్పిటల్ కు తరలించారు. సందీప్ ఫుడ్ ఆధికారులు కు ఫిర్యాదు చేయడంతో మిఠాయి పొట్లం షాపును ఫుడ్ ఇన్ స్పెక్టర్ రోహిత్ తనిఖీ చేయగా వివిధ రకాల విలువైన జ్యూస్, తిని పదార్థాలు కాలం చెల్లిన వాటిని స్వాధీనం చేసుకున్నారు. షాపు ఓనర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఫుడ్ అధికారులు తెలిపారు. ఉన్నత ఆధికారులు మేరకు షాపుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలం చెల్లిన మిఠాయి స్వీట్ షాపు ఓనర్ పై చర్యలు తీసుకొని లైసెన్స్ రద్దు చేయాలని విద్యార్థుల సంఘం నాయకలు డిమాండ్ చేశారు.

# ఐఓసీఎల్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సికింద్రాబాద్ విక్రయ విభాగం తమ వద్ద నమోదైన కస్టమర్లను ప్రోత్సహించడానికి దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి సందర్భంగా ఆయా ప్రాంతాలలో పని చేస్తున్న డీలర్ల వద్ద గ్యాస్ ఉపకరణాలు స్టౌ, సిలిండర్ ట్రాలీ, యాప్రాన్ లాంటి వస్తువులు కొనుగోలు చేస్తే డ్రా ద్వారా విజేతలకు 25 గ్రాముల వెండి నాణేలు అందజేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. యే దీవాలి చాందనే వాలే కార్యక్రమం కింద ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబరు మాసం వరకు ఇండేన్ ఎల్పీజీ డీలర్ల వద్ద స్టౌ, ఇతర ఉపకరణాలు పొందిన కస్టమర్ వివరాలను డ్రాప్ బాక్స్ లో వేసి సికింద్రాబాద్ ఇండేన్ డివిజనల్ కార్యాలయం వేదికగా ఏక కాలంలో నూట డెబ్బై మంది డీలర్లతో జూమ్ సమావేశం నిర్వహించి డ్రా కొనసాగించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఓసీఎల్ తెలంగాణ, ఆంధ్ర జనరల్ మేనేజర్ యోగా రాణి సురేశ్ మాట్లాడుతూ కస్టమర్లకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో అత్యంత నాణ్యమైన ప్రమాణాలతో తయారైన గ్యాస్ స్టౌలు, సిలిండర్ ట్రాలీ, యాప్రాన్ తదితర గ్యాస్ ఉపకరణాలు ఎంపిక చేసిన వెండార్ల ద్వారా డీలర్లకు అందిస్తున్నామని తెలిపారు. గత ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మాసం వరకు స్టౌలతో సహా కనెక్షన్లు పొందిన వారిని ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణలోని ఎంపిక డీలర్ల వారీగా డ్రా నిర్వహించి ఎంపికైన కస్టమర్ కు సిల్వర్ కాయిన్ అందిస్తున్నామన్నారు. పాత స్టౌ వాడుతున్న వారు హై థర్మల్ ఎనర్జీ స్టౌలు కొనగోలు చేయాలని, ఆకర్షణీయమైన డిస్కౌంట్ వర్తచడంతో పాటు క్రిస్మస్ సందర్భంగా జరిగే మరో డ్రాకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సికింద్రాబాద్ డివిజనల్ హెడ్ సీతేష్ కుమార్ మాట్లాడుతూ తమ కంపెనీ పండుగల పూట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విశేష స్పందన వస్తుందన్నారు. ప్రతి కస్టమర్ డీలర్ల ద్వారా నిర్వహించే ప్రాథమిక భద్రతా తనిఖీ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. విధిగా కాలం చెల్లిన సురక్ష రబ్బరు ట్యూబు మార్చాలని, గ్యాస్ లీకేజికి టోల్ ఫ్రీ నంబరు 1906 ఉపయోగించాలని, సిలిండర్ ఎప్పుడూ నిలబెట్టి ఉంచాలని, కిచెన్ ప్లాట్ ఫాం విధిగా ఉండాలని, ప్రమాదానికి కారణమయ్యే ఏ మండే వస్తువు గ్యాస్ సిలిండర్ సమీపంలో ఉండోద్దని కోరారు. ఐఓసీఎల్ సీనియర్ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా యాభై శాతానికి పైగా గ్యాస్ కస్టమర్లు కలిగిన సంస్థ ఐఓసీఎల్ అత్యంత ప్రమాణాలు కలిగిన ఉపకరణాలు అందిస్తుందని, అవి ఇండేన్ డీలర్ల వద్ద లభిస్తాయని వాటిని ప్రోత్సహించాలని కోరారు. ప్రధాన పండులైన దీపావళి, క్రిస్మస్,సంక్రాంతి వరకు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో లక్కి డ్రా కొనసాగుతుందన్నారు. కరీంనగర్ ఎల్పీజీ సేల్స్ ఏరియా డ్రా కార్యక్రమం మంచిర్యాల కేంద్రంగా అధికారి మిట్ట మహేశ్ పర్యవేక్షణలో జరిగింది. హుజురాబాద్ అంబుజా గ్యాస్ ఏజన్సీలో అధినేత పీవీ మదన్ మోహన్ కొనసాగించారు. ఈ సందర్భంగా గ్యాస్ ప్రమాదాలు కస్టమర్ అవగాహన లోపం వల్ల ముఖ్య ప్రమాణాలు పాటించని రబ్బరు ట్యూబు వాడడం వల్లే అని తెలిపారు. ఇందు కోసం ప్రభుత్వం బేసిక్ సేఫ్టీ చెక్ కార్యక్రమాలు డెలివరీ సిబ్బంది ద్వారా నిర్వహించి ఎనిమిది అంశాలతో కూడిన ప్రశ్నావళి ద్వారా గ్యాస్ వాడే పరిస్థితులు తెలుకుంటున్నామని తెలిపారు. సురక్ష రబ్బరు ట్యూబు వాడాలని, కాలపరిమితి ఐదు సంవత్సరాలుగా ఉంటుందన్నారు. విధిగా ప్రాథమిక భద్రతా తనిఖీ నిర్వహించాలని డెలివరీ సిబ్బందిని కోరాలని సూచించారు. హుజురాబాద్ అంబుజా గ్యాస్‌కు చెందిన గోపాలపురం నివాసి ప్రచిసియా ప్రాచి వెండి నాణేన్ని పొందారు. తెలంగాణ వ్యాప్తంగా జరిగిన కార్యక్రమంలో అధికారులు నాయక్, లలితా పరమేశ్వరి, వీఆర్ రెడ్డి, సీనియర్ ఎల్పీజీడీలర్లు శ్రీచరణ్, ఐలారెడ్డి, రమేశ్, రాజ్‌మోహన్, ఆనంద్, సత్యనారాయణ గౌడ్, సుభాష్ రావు, వామన్ రావు, సురేందర్ పాల్గొన్నారు.



# ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు నిలిపివేయాలి

## బీసీ హక్కుల నేత ఎన్.రాజమౌళి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలో అధికారం ఎగువ కులాల ఆధీనంలో ఉండడం వలన దేశ జనాభాలో సగభాగంగా ఉన్న బహుజనులకు తీరని అన్యాయం జరిగిందని, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి అన్నారు. బుధవారం హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్ద బీసీ కుల సంఘాల నిరసన దీక్షకు హాజరై సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎకనామికల్ వీకర్స్ సెక్షన్ రిజర్వేషన్ల వలన వెనుకబడిన తరగతుల వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే ఈడబ్ల్యూఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడతామంటున్న జనగణనలో బీసీ జనాభా లెక్క తేల్చి జనాభా ఆధారంగా అన్ని రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలలో, చట్టసభలలో, ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీ వర్గాలను సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేటట్లు చూడాలన్నారు. నాలుగు శాతం కూడా లేని ఎగువ కులాలకు పది శాతం రిజర్వేషన్లు ఇవ్వడం, దానిని కోర్టు వ్యతిరేకించకపోవడం, సవరణ ద్వారా కొనసాగడానికి నిదర్శనమన్నారు. కులాతీత శ్రమ దోపిడీ లేనటువంటి వ్యవస్థ నిర్మాణం కోసం సామాజిక,ఆర్థిక, రాజకీయ పోరాటాలు, ఆత్మగౌరవ పోరాటాలు, అస్తిత్వ పోరాటాలు, ఐక్య పోరాటాలు చేయవలసిన ఆవశ్యకత ఆసన్నమైందన్నారు. జేఏసీ కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలో జేఏసీ రాష్ట్ర నాయకులు సాయిని నరేందర్, ప్రముఖ సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ శేషు, బట్టి శ్యాము, ఎదునూరి రాజమౌళి, పులి శ్రీనివాస్, విద్యావేత్త సరళ, రజిత, వెంకటలక్ష్మి తదితరు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23 మందికి జరిమాన



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ 04 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.4500 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23మందికి రూ.23,700 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

# ఎస్సార్ స్కాలర్స్ లో ముందస్తు దీపావళి

## ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక రాంనగర్ లోని ఎస్సార్ స్కాలర్స్ స్కూల్ లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను సుందరంగా అలంకరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద పాఠశాల డీజీఎం కవితారెడ్డి, ప్రిన్సిపాల్ సంకీర్తనా రెడ్డి టీచర్లతో కలిసి లక్ష్మీపూజ నిర్వహించారు. అనంతరం దీపాలు వెలిగించారు. సంప్రదాయ దుస్తుల్లో హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలో పటాకులు కాల్చి, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంకీర్తనా రెడ్డి దీపావళి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. దీపావళి అంటేనే వెలుగుల పండుగ అని, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా మనమంతా పండుగను జరుపుకుంటామని తెలిపారు. హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో, అత్యంత ఇష్టంగా జరుపుకునే పండుగల్లో ఇది కూడా ముఖ్యమైందన్నారు. దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి హాని కలిగించకుండా దీపావళి పండుగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు.

# భయపెట్టే ప్రేమ


## డిసెంబరు 20న విడుదల కానున్న 'శారీ'

## భారీగా ప్లాన్ చేసిన దర్శకుడు రాంగోపాల్ వర్మ



ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ డెన్ నుంచి వస్తున్న 'శారీ' చిత్రం డిసెంబరు 20న థియేటర్‌లో విడుదలకానుంది. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా రిలీజ్ డేట్ వెల్లడిరచారు. ఇందులో యువనటి ఆరాధ్య దేవి హీరోయిన్‌గా నటించగా, సత్య యాదు హీరో. పలు వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగా రూపొందించారు. తమిళం, తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రానికి గిరి కృష్ణ కమల్ దర్శకుడు. ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమైంది. అతి ప్రేమ భయంకరంగా ఉంటుందనేది ఈ సినిమా మూల కథ. సోషల్ మీడియాలో జరిగే కొన్ని ఊహించని విషయాల వల్ల సమాజంతో పాటు వ్యక్తిగత జీవితంలో జరిగే మార్పులు ఇందులో ప్రధానంగా ప్రస్తావించారు. ఇందులో భయపెట్టే ప్రేమికుడి పాత్రలో సత్య యాదు నటించారు. కాగా.. ఈ చిత్రంలో నటించిన ఆరాధ్య దేవి కేరళకు చెందిన వర్ధమాన నటి. గతంలో శ్రీలక్ష్మి అనే పేరుతో పరిశ్రమకు పరిచయమైంది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎవరో తనకు ఫార్వార్డ్ చేసిన ఆరాధ్య రీల్స్ చూసి ఈమెను కనిపెట్టి కొత్త పేరు పెట్టి మరీ ఈ 'శారీ' చిత్రంలో హీరోయిన్‌గా రాంగోపాల్ వర్మ ఎంపిక చేయడం గమనార్హం. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం పోస్టర్లు ప్రేక్షకులను అమితంగా ఆకర్షించిన విషయం తెల్సిందే.







# హీరోయిన్లు కూడా దిగదుడుపే

## వైరల్ అవుతున్న శ్రీముఖి ఫొటోలు

బుల్లితెరపై స్టార్ యాంకర్లలో శ్రీముఖి ఒకరు. ఈ అమ్మడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఓవైపు టీవీల్లో వరుసగా రియాల్టీ షోస్ చేస్తూనే.. మరోవైపు సినిమాల్లో కీలకపాత్రలు పోషిస్తుంది. స్టార్ యాంకర్‌గా రాణిస్తున్న ఈ చిన్నదానికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. స్టేజ్ అల్లరి.. చలాకీ తనంతో యాంకర్?గా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఈ బ్యూటీకి సోషల్ మీడియాలో భారీగా ఫాలోయింగ్ ఉంటుంది. టీవీ షోలతో ఫుల్ బిజీగా ఉంటున్న ఈ బ్యూటీ.. సినిమాల్లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుంది మొన్నామధ్య మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో హీరోయిన్ ఫ్రెండ్ గా నటించి మెప్పించింది ఈ వయ్యారి భామ. రోజూ నెట్టింట సందడి చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. రీల్స్.. ఫన్నీ వీడియోస్ చేస్తూ ఫ్యాన్స్ కు టచ్ లో ఉంటుంది.ఈ అమ్మడు ఇన్ స్టాలో షేర్ చేసే ఫోటోలకు మంది క్రేజ్ ఉంటుంది. ఈ ఫోటోలకు వేలల్లో లైక్స్ , షేర్స్ ఉంటాయి.





# ఎస్ఎస్ఎంబీపై ఫస్ట్ అప్‌డేట్

## ఎడారిలో తిరుగుతున్న ఫొటో షేర్ చేసిన రాజమౌళి

దర్శకధీరుడు రాజమౌళి తన తాజా చిత్రం గురించి అప్డేట్ ఇచ్చారు. మహేశ్‌బాబు హీరోగా ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ సినిమా పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం చిత్రబృందం దృష్టి అంతా ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులపైనే ఉంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని టాక్. అయితే ఈ చిత్రం గురించి ఇప్పటిదాకా ఏ విషయం అఫీషియల్‌గా బయటకు రాలేదు. తాజాగా దర్శకుడు రాజమౌళి ఓ అప్‌డేట్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా ఎడారి ప్రాంతంలో తిరుగుతున్న ఫొటో షేర్ చేసి 'కనుగొనడం కోసం తిరుగుతున్నా' అని క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన మహేశ్ సినిమా కోసం లొకేషన్స్ సెర్చ్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. త్వరలోనే అప్‌డేట్ షేర్ చేయాలని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. అయితే ఈ చిత్రంలో జంతువులు ఎక్కువగా కనిపిస్తాయి అని ఇటీవల జక్కన్న హింట్ ఇచ్చారు. తాజాగా ఆయన పోస్ట్ చేసిన ఫొటోలో జంతువుల గుంపు కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. కనీసం ఇలాగైనా అప్‌డేట్ ఇచ్చారంటూ అభిమానులు ఆనందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం రాజమౌళి ఏఐ టెక్నాలజీని వినియోగించనున్నట్లు వార్త?ని వినిపించాయి. దీనికోసం ఆయన ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు తెగ వైరలైంది. సినిమాలోని కొన్ని పాత్రలు, జంతువుల కోసం ఆయన ఏఐ టెక్నాలజీని ఉపయోగించనున్నారని తెలుస్తోంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు.



# సంక్రాంతి పోటీ నుంచి తండేల్ ఔట్

'కస్టడీ' సినిమా తర్వాత అక్కినేని నాగ చైతన్య నటిస్తోన్న కొత్త చిత్రం తండేల్. మెచ్చుటగా మూడోసారి దర్శకుడ చందూ మొండేటితో జత కట్టిన ఆయన ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. సాయి పల్లవి రెండోసారి చైతూతో చేస్తుండగా దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాని పాన్ ఇండియా ప్రాజెక్ట్ రిలీజ్ చేయడానికి గీత ఆర్ట్స్ ప్లాన్ చేసింది. అయితే ఈ సినిమా విడుదల విషయంలో అనేక వార్తలు వినిపిస్తున్న సమయంలో ఈ చిత్ర దర్శకుడు ఓ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో తంగేల్ రిలీజ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జనవరికి తండేల్ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంటుందని, మరో 10 రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని అన్నారు. ఈ డిసెంబర్ 25కి సినిమా రిలీజ్‌కు రెడీ కాదని స్పష్టం చేశారు. అయితే ఒకవేళ రామ్ చరణ్ సినిమా గేమ్ చేంజర్ విడుదల ఉందని ఉందని అల్లు అరవింద్, వెంకీ మామ సినిమా వస్తుందని చైతన్య ఆలోచిస్తే సంక్రాంతికి కూడా తండేల్ మూవీ రిలీజ్ ఉండదని అన్నారు. దీంతో ఇప్పుడు ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. అక్కినేని ఫ్యామిలీకి ఎంతో కలిసొచ్చే సంక్రాంతికి తండేల్ సినిమా విడుదలపై అనుమానాలు రావడంతో సినిమా రిలీజ్ డేట్‌పై అప్డేట్ ఇవ్వాలంటూ నాగచైతన్య ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ సినిమాలపైన ఉన్న శ్రద్ధ మీ సినిమా రిలీజ్‌పై లేదు అటూ చురకలు పెడుతునే సినిమా థియేటర్ రిలీజ్ ఏమొద్దు డైరెక్టు ఓటీటీ రిలీజ్ చేయడంటూ ఓ రేంజ్‌లో కామెంట్లు చేస్తున్నారు.

# క్రియాశీల సభ్యత్వం ముమ్మరంగా చేయాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి
- భారీగా హాజరైన మద్దతుదారులు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లాలో బీజేపీ క్రియాశీల సభ్యత్వాలను ముమ్మరంగా చేపట్టాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు వరంగల్ జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు అభియాన్ లో భాగంగా కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్ లో వరంగల్ జిల్లా బీజేపీ క్రియాశీల సభ్యత్వ నమోదు సమావేశం బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభ్యత్వ నమోదు కార్యశాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుజ్జుల ప్రేమెందర్ రెడ్డితోపాటు జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జి పొనుగోటి పాపరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందమందిని బీజేపీలో సభ్యులుగా చేర్చిన వారు క్రియాశీల సభ్యులుగా అర్హులన్నారు. రూ.100 ఆన్ లైన్ లో చెల్లించి క్రియాశీల సభ్యులుగా చేరాలన్నారు. ప్రతి మండలానికి 100 మందిని క్రియాశీల సభ్యత్వం తీసుకునేలా చూడాలన్నారు. పార్టీలో బూత్ అధ్యక్షుల నుంచి జాతీయ అధ్యక్షుల వరకు క్రియాశీల సభ్యత్వం తీసుకోవాల్సిందేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, గురుమూర్తి శివకుమార్, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతి రెడ్డి, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, క్రియాశీల సభ్యత్వ ఇంచార్జి ఎరుకుల రఘునారెడ్డి, జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చా అధ్యక్షులు, జిల్లా మండల, డివిజన్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జిలు పాల్గొన్నారు.

# ఇంటింటా దీపావళి వేడుకలకు ముస్తాబు

**పూజలు, వ్రతాలతో చేసేందుకు సిద్ధమవుతున్న ప్రజలు**

**తీపి వంటకాలతో దీపావళి వేడుకలు**






**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రసాద్ కంప్యూటర్స్ నిర్వాహకురాలు హేమ పలు రకాల తీపి పదార్థాలు చేశారు. దీపావళి వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో పిండి వంటలు, స్వీట్స్ తయారు చేసుకోవడం ఆనవాయితీ. అయితే ఈ ఆనవాతీలో భాగంగా హేమ మోతీ చూర్ లడ్డు, చంద్రకళ స్వీట్స్, కాజ్ బాద్ షా, జిలేబీ, బేసన్ లడ్డు, సున్నుండలు, డ్రై ఫ్రూట్ లడ్డు, మురుకులు తదితర పిండి వంటలు, స్వీట్స్ తయారు చేసి దీపావళి పండుగను తీపిగా మార్చారు. అలాగే ఎవరికైనా ఆర్డర్ పై స్వీట్స్, ఇతర పిండి పదార్థాలు కావాలంటే తయారు చేసి కూడా అందిస్తామని ఆమె తెలిపారు.

# రైస్ మిల్లర్లు సహకరించాలి

- నిర్ణీత గడువులోగా ధాన్యం కొనుగోలు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, డీఆర్డీఏ, అధికారులు, రైస్ మిలర్లతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జీవో 27 ప్రకారం 10శాతం బ్యాంకు గ్యారంటీ, లేదంటే సెక్యూరిటీ డిపాజిట్ ను సమర్పించినట్లయితే ధాన్యాన్ని కేటాయిస్తామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఒక్కో రైస్ మిల్లుకు ఒక్కో వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించడం జరుగుతుందన్నారు. వారం రోజుల లోపు బ్యాంకు లేదా సెక్యూరిటీ డిపాజిట్ ను రైస్ మిల్లర్లు సమర్పించాలని సూచించారు. సన్న, దొడ్డు రకం ధాన్యాల లోడులను వేరువేరుగా రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే 24 గంటల్లోగా అధికారులు పరిష్కరించాలన్నారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్డీఓ నాగ పద్మజ, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ కు బీసీ కమిషన్ బృందం..

బీసీ కమిషన్ బృందం నవంబర్ 2వ తేదీన హనుమకొండకు రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఎన్ఐసీ హాల్ లో బీసీ కమిషన్ బృందం రాక నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ బృందంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి ఉన్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుల సంఘాల ప్రతినిధుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం సాయంత్రం 4.30 గంటలకు ప్రెస్ మీట్ లో కమిషన్ బృందం మాట్లాడతారని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ జి.రామ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# రాజుకు జర్నలిస్టుల నివాళులు

**కుటుంబానికి అండగా ఉంటామంటూ హామీ**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత మూడు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నిన్న మరణించిన సీనియర్ వీడియో జర్నలిస్ట్ కాగితోజు రాజ్ కుమార్ మృతదేహానికి బుధవారం సాయంత్రం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్ట్ కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. రాజకుమార్ కుటుంబ సభ్యులకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అండగా ఉంటుందని ప్రెస్ క్లబ్ బాధ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు దాసరి కృష్ణారెడ్డి, బీఆర్ లెనిన్, తుమ్మ శ్రీధర్ రెడ్డి, వళ్లాల వెంకటరమణ, చిలుముల సుధాకర్, గడ్డం రాజిరెడ్డి, బొక్క దయాసాగర్, తోట సుధాకర్, గాడి పల్లి మధు, నంబూద్రి, ప్రెస్ క్లబ్ కోశాధికారి బోలా అమర్, వైస్ ప్రెసిడెంట్ బొడిగే శ్రీనివాస్, ఈసీ మెంబర్లు జనగాని ఆంజనేయులు, దొమ్మటి శ్రీకాంత్, విజయ్ రాజ్, మంచాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సర్వేలో.. మా సేవలు వినియోగించుకోండి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నవంబర్ 6 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలను కూడా వినియోగించుకోవాలని పాలకుర్తి రమణ విజ్ఞప్తి చేశారు. పొద్దంతా పాఠశాలలో విద్యార్థులతో కుస్తీ పట్టిన ఉపాధ్యాయులు సాయంత్రం వేళ సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వే చేయాలంటే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. పదవీ విరమణ పొందిన వారి సేవలను వినియోగించుకోవడం ద్వారా ఖచ్చితత్వంతోపాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయవచ్చన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రితో పాటు ఇతర అధికారులు, కలెక్టర్లు ఆలోచించాలన్నారు.

# బీసీలకు అన్యాయం చేస్తే యుద్ధమే

**ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ సమాజాన్ని అణచివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని, ఆ కుట్రలో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకొచ్చిందని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ ఆరోపించారు. బీసీలకు అన్యాయం చేస్తే ఇక యుద్ధమే అని హెచ్చరించారు. జీఓ నెం.29 రద్దు, ఈడబ్ల్యూఎస్ రద్దు, కుల గణన విధి విధానాలపై స్పష్టత కోరుతూ హనుమకొండ జిల్లా కేంద్రంలోని జయశంకర్ పార్కు ధర్నా చౌక్ వద్ద ఆల్ ఇండియా ఓబీసీ జాక్, తెలంగాణ పూలే యువజన సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఒక్క రోజు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ నిరసన దీక్షలో గొల్లపల్లి వీరాస్వామి, నలుబాల రవి కుమార్, నారాయణ గిరి, నలబోల అమర్, తాటికొండ సద్గుణ, కోడిపాక దేవిక, ఎలవర్తి రాధక్క, పద్మజ దేవి, సరోజన, అశ్విని, తెలంగాణ కొమురయ్య, కర్రే చంద్రశేఖర్, అనిశెట్టి సాయితేజ, మామిడి రాకేష్, మాధవి, స్వప్నరాణి, సాత్విక, స్వప్న, ప్రసన్న, ధారబోయిన సతీష్, దొమ్మాటి ప్రవీణ్, కొండి కృష్ణ గౌడ్, రాసూరి రాజేష్, పెద్దోజు వెంకటచారి తదితరులు పాల్గొనగా విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ఉద్యోగ సంఘాల నాయకుడు ధారం జనార్ధన్ బహుజన మహనీయులు మహాత్మా జ్యోతి రావుపూలే, సావిత్రి బాయి పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బి.పి మండల్ చిత్రాలకు, దీక్ష దారులకు పూల మాలలు వేసి దీక్షను ప్రారంభించగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పులి శ్రీనివాస్ గౌడ్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

# బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓగా రాథోడ్ రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఆర్డీవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ పి.ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసిన మొక్కను అందజేశారు. అదేవిధంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ కు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com